క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లో ఏర్పాటు చేసే వైద్య శిబిరంలో ఉచితంగా కార్డియాలజీ పరీక్షలు నిర్వహిస్తామని కార్పొరేటర్ సుభాష్ నాయక్ తెలిపారు. ప్రతిమ ఆస్పత్రి వారి సహకారంతో బీపీ చెకప్, బీఆర్‌బీఎస్, 2డి ఏకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించి డాక్టర్లు సలహాలు సూచనలు ఇస్తారని చెప్పారు. జనరల్ ఫిజీషియన్ కూడా అందుబాటులో ఉండి ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. డివిజన్ వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటినుంచి మరకత లక్ష్మీగణపతి స్వామి బ్రహ్మోత్సవాలు



అల్వాల్: కానాజీగూడలోని మరకత లక్ష్మీగణపతి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు ఘనంగా పూర్తయ్యాయి. ఉదయం 4 గంటలకు గోపూజ, కలశ స్థాపన ఉత్సవాలకు అంకురార్పన జరగనుంది. అనంతరం కుంకుమార్చన, లక్ష్మీ గణపతి, కుబేర నారసింహ సుదర్శన హోమాలు జరుగుతాయి. ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు.

ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా వంజరి ప్రవీణ్



కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలకు మీర్‌పేట్-హెచ్‌బీకాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత వంజరి ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు ఉత్సవ కమిటీలో చోటు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించి సత్కరించారు.

మినరల్ వాటర్ చలివేంద్రం ప్రారంభం

రామంతాపూర్: ప్రధాన రహదారిలోని విశాల్ మేఘా మార్ట్ వద్ద శనివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మేడ్చల్ అధ్యక్షుడు సంబు పాండయ్యగుప్తా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు రమేష్ గుప్తా, శ్రవణ్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, నగేష్ గుప్తా, కార్పొరేటర్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 4 మెటీరియల్ అందజేత

ముషీరాబాద్: తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా 100 మంది పేద విద్యార్థులకు గ్రూప్-4 మెటీరియల్‌ను శనివారం లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. అధ్యక్షులు యాదయ్య మాదిగ పిలుపు మేరకు అందజేశామని తెలిపారు. దళితులు చదువుకు దూరం అవుతున్నారని 2023-24 విద్యా సంవత్సరంలో పేద విద్యార్థులకు ఉచిత నిర్బంద విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గజ్జల సూర్యనారాయణ, మాదిగ రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు సంపూర్ణమాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సరస్వతి, అశోక్, రాణిలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ సహకారంతో మెటీరియల్‌ను అందజేశామన్నారు. జయశీల, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి వేద పాఠశాల విద్యార్థుల స్వాగతం

కాచిగూడ: రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నగరానికి వచ్చిన సందర్భంగా కాచిగూడలోని ఉత్తరాధి మఠం వేద పాఠశాలకు చెందిన వేద విద్యార్థులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ప్రధానికి ఘన స్వాగతం పలికారు. శనివారం ఉత్తరాది మఠం పగడాల జయతీర్థాచార్యులు, పద్మనాభాచార్యుల శిష్యులు పరేడ్ గ్రౌండ్స్ వద్ద సభా ప్రాంగణంలో వేదం, శాంతి మంత్రం పఠించారు. చిన్నారులు వేదం పఠించిన విధానం చూసి ప్రధాని, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, భారతీ రమణాచార్య, గోపాలాచార్య తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద స్వాగతం పలుకుతున్న వేద విద్యార్థులు

డిసెంబర్ నాటికి అందుబాటులోకి..



చర్లపల్లిలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్, ప్రయాణికులు

- అధునాతన హంగులతో చర్లపల్లి రైల్వే టెర్మినల్
- చర్లపల్లి మీదుగా రెండో వందే భారత్ రైలు..
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
- స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం

కుషాయిగూడ: అధునాతన హంగులతో నిర్మితమవుతున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్‌కు శనివారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ చర్లపల్లి మీదుగా రెండో వందే భారత్ ట్రెయిన్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో చర్లపల్లి రైల్వే టర్మినల్ అభివృద్ధితో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయని అన్నారు. ప్రతి రైలు ఇక్కడ నిలపడంతో పాటు చాలా రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాదం, నాయకులు నర్సింగ్‌రావు, వివేక్‌తో పాటు రైల్వే అధికారులు దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో..

గౌతంనగర్: మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలుకు ఘన స్వాగతం లభించింది. శనివారం భారత ప్రధాని నరేంద్రమోదీ నగరానికి వచ్చి సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే ఎంఎంటీఎస్ రైలుకు స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్, ప్రయాణికులు సంఘం ప్రధాన కార్యదర్శి, డీఆర్‌యుసీసీ సభ్యులు నూర్ అహ్మద్‌తో పాటు పలువురు ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పర్చేందుకు నూతనంగా ప్రారంభించిన ఎంఎంటీఎస్ రైలు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

అల్వాల్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి దోహదపడతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని దుర్గా మసీదు సయ్యద్ సాదత్ ప్రారంభోత్సవానికి ఆయన కార్పొరేటర్లు రాజ్ జితేంద్రనాథ్, చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసర్ నమాజ్ ఖిరాత్‌వాజ్ ఖితాబత్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పరుశురాం, నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, మసీద్ కమిటీ సభ్యులు సయ్యత్ ఆతిక్‌పాషా, హమత్, సిరాజ్, అయూబ్‌ఖాన్, ఇషాక్‌ఖాన్, షేక్ గౌస్, సయ్యద్ ఆరిఫ్, సయ్యద్ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్లు

అనంతరం తుర్కపల్లి సమీపంలోని ఈద్గా వద్ద నూతన పవర్ బోరును మంజూరు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం మల్కాజిగిరిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. సుమారు 29 రోజులు నాలుగు డివిజన్లలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర నిర్వహించామని, ప్రజల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ హయాంలోనే ఆర్‌యూబీలు మంజూరయ్యాయని, వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులు కబుర్లు చెబుతున్నారే తప్ప పనిచేయడం లేదన్నారు. బీజేపీ నాయకులు ఏమి చేస్తారో చెప్పకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. గ్యాస్ ధర పెరిగినా రెండు పార్టీలు పట్టించుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ బండ ఇస్తామన్నారు. ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్‌ను మించిన పార్టీ లేదన్నారు. 58 జీవో ద్వారా దరఖాస్తు చేసుకుంటే 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణకు లక్షల రూపాయలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి, తర్వాత రూ.3 లక్షలు కూడా ఇవ్వలేదన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, వ్యాసగోని, శ్రీనివాస్‌గౌడ్, గుత్తి చందు, డోలి రమేష్, యాదగిరి, సానాది శంకర్, రాములు, అలీ, ఉమేష్‌సింగ్, వినోద్‌యాదవ్, బి.కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

ఉప్పల్: ఉప్పల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్త మానవాళి శాప విమోచన, పాప పరిహారం కోసం శిలువపై ప్రాణత్యాగం చేశాడని అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఈ రన్ నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ చర్చస్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గోన పిలిప్, జంపాల శ్రీనివాస్, జిడిపల్లి యోహాను, జాన్ వెస్లీ, తేజోమయ, శాంతిమణి, దేవాదానం తదితరులు తెలిపారు.



ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ర్యాలీగా.. ఉప్పల్ చర్చస్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చక్రీపురం చౌరస్తా నుంచి..

కుషాయిగూడ: గుడ్ ఫ్రైడే సందర్భంగా పీపీడబ్ల్యూఏ, ఎస్‌పీఏ పాస్టర్స్ ప్రేయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చక్రీపురం చౌరస్తా నుంచి ఏఎస్‌రావునగర్ వరకు సాగిన కార్యక్రమంలో గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



మాజీ మేయర్ బొంతు రాంమోహన్, శ్రీదేవి దంపతులు



బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ప్రశాంతంగా ఎస్సై మెయిన్స్ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని ప్రిన్స్‌టన్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఎస్సై మెయిన్ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. శని, ఆదివారాలు రెండు రోజులు నిర్వహించే ఈ పరీక్షా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాన్ని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన 14 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద డీసీపీ, ఏసీపీ స్థాయి పోలీస్ అధికారులతో పరిస్థితిని పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నామని సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదన్నారు. రాచకొండ డీసీపీ జానకి ధరావత్, నర్మద, ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ గోవిందరెడ్డి ఉన్నారు.

పేదలకు అండగా బస్తీ దవాఖానా



జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో బస్తీ దవాఖానా ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతినగర్‌లో నిర్మించిన బస్తీ దవాఖానాను శనివారం మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరికీ మెరుగైన వైద్య సదుపాయాలను అందజేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ముందుకెళ్తోందన్నారు. జవహర్‌నగర్‌లో మరో నాలుగు బస్తీ దవాఖానాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

జవహర్‌నగర్: సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో అందజేస్తున్న ఆర్థిక సాయం ఆడబిడ్డలు ఉన్న పేదింటి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని తహసీల్దార్ మీటింగ్ కార్యాలయంలో కాప్రా తహసీల్దార్ అనిత ఆధ్వర్యంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ రామలింగంతో కలిసి మంత్రి మల్లారెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

పన్నులు ప్రభుత్వానికి.. రోగాలు ప్రజలకు..

రామంతాపూర్: గాంధీనగర్‌లోని జీహెచ్ఎంసీ మోడల్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద 15 రోజులుగా పొంగిపొర్లుతున్న భూగర్భ డ్రైనేజీలకు మరమ్మతులు చేయాలంటూ శనివారం ఫంక్షన్ హాల్ ఎదుట సీపీఎం కార్యకర్తలు, నేతలు నిరసన తెలుపుతూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం సెక్రటరీ ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద 15 రోజులుగా మురుగు రోడ్లపై పారుతోందని, అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదన్నారు. ఫంక్షన్ హాల్‌తో వచ్చే ఆదాయం జీహెచ్ఎంసీ తీసుకోగా.. మురుగు వ్యర్థాలను మాత్రం రోడ్లపైకి వదిలి ప్రజలను రోగాలపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు.. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకపోతే జీహెచ్ఎంసీ ఉప్పల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు రమేష్, లలిత, సుశీల, లల్లూ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఆర్‌ను కలిసిన కేపీఆర్



మేడిపల్లి: మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్ కార్యచరణ, పార్టీ బలోపేతంపై ఆయన చర్చించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యం అన్నారు.


రంజాన్ కానుకల పంపిణీ



ముస్లింలకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్, అణుపురంలోని జామై మజీద్ ఈ మహమ్మదీయ మసీదులో శనివారం కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి చేతులమీదుగా దుస్తులను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, నాయకులు రవిశంకర్‌రెడ్డి, మసీదు కమిటీ అధ్యక్షుడు రియాజ్ మహమ్మద్, ఎం.ఇక్బాల్, సాదిక్, ఖదీర్, సలీంఖాన్, సబిల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి

కుషాయిగూడ: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన చింత రామకృష్ణ కుటుంబ సభ్యులకు శనివారం బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ తెలిపారు. ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంకిర్యాల నర్సింహ, వెంకటేష్, కృష్ణ, సాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులు

ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ బాలేందర్ షాపు నుంచి పాలసత్తి వీధి బొడ్రాయి వరకు రూ.60 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌ను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, ఓపెన్ నాలాల ఆధునీకరణ, డ్రైనేజీ నూతన పైపులైన్లు, తాగునీటి పైప్‌లైన్లు, డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను దాదాపు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, బాలేందర్, ఫొటో బాలు తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఐక్యంగా కాలనీని అభివృద్ధి చేసుకోవాలి

కుషాయిగూడ: ఐక్యంగా కాలనీని అభివృద్ధి చేసుకోవాలని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. నూతనంగా ఎన్నికైన చర్లపల్లి డివిజన్, రైల్‌విహార్ కాలనీ నూతన సంక్షేమ సంఘం ప్రతినిధులను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ అవసరాలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొడిగె ప్రభాకర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, బొడిగె ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బొడిగె ప్రభాకర్‌గౌడ్‌ను అభినందిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, శ్రీదేవి దంపతులు

పూలే జయంత్యుత్సవ కమిటీ కో- ఆర్డినేటర్‌గా రాజేందర్



ముషీరాబాద్: ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యుత్సవ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ముషీరాబాద్‌కు చెందిన మాదేశి రాజేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పూలే జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు.